ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 జనగామ
బుధవారం 8 మే 2024


మాట్లాడుతున్న కడియం కావ్య


మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

యుద్ధంలో అండగా నిలవండి..

- మోదీకి వరంగల్ మిర్చి ఘాటు తగలాలి..
- విభజన చట్టం హామీలను తుంగలో తొక్కాడు..
- జవాబిచ్చాకే ఆయన వరంగల్‌లో కాలుపెట్టాలి..
- బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే..
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హనుమకొండ చౌరస్తాలో కార్నర్ మీటింగ్

హనుమకొండ సిటీ/ వరంగల్ సిటీ, మే 7: ప్రధాన మంత్రి మోదీ నియంత పాలన అంతానికి తాను చేస్తున్న యుద్ధానికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమ్మక్క-సార లమ్మ, ప్రజాకవి కాళోజీ, తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్, కేయూ పోరాట బిడ్డల స్ఫూర్తి, పోరుగడ్డ ఓరుగల్లు పౌరుషాన్ని మరోసారి చాటేలా తన పక్షాన నిలవాలని అభ్యర్థించారు. ఢిల్లీ సుల్తాన్‌ల కు వరంగల్ మిర్చి ఘాటు తగలాలని సూచించారు. వరంగల్ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం రాత్రి హనుమకొండ చౌరస్తా, వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడి యం కావ్య ప్రచారంలో భాగంగా కార్నర్ మీటింగుల్లో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్‌పై పదు నైనా వాగ్బాణాలు సంధిస్తూ ప్రసంగించారు. ఓరుగల్లు పోరా ట చరిత్రను వల్లవేస్తూ ప్రసంగాన్ని ఆరంభించారు.

మే 13న జరిగే లోక్‌సభ ఎన్నిక యుద్ధంలో బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓరుగల్లు పోరాట స్ఫూర్తిని రుచి చూపించాలని పునరుద్ఘాటించారు. దేశంలో నియంత పాలన అంతానికి సాగిస్తున్న పోరాటంలో ఓరుగల్లు ప్రజలు అండగా నిలవాలని పదే పదే విజ్ఞప్తి చేశారు. పదేళ్ల పాలనలో బీజేపీ, బీఆర్ఎస్ తెలంగాణకు అన్యాయం చేశాయని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. 2014 తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు క్రమంలో విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను ప్రధానమంత్రి మోదీ తుంగలో తొక్కాడన్నారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీతో పాటు తెలంగాణలో ఐటీ ఆర్ కారిడార్, ఐఐటీ ఏర్పాటు తదితర హామీలను మోదీ విస్మరించారన్నారు. తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ బీజేపీని నిలదీయలేదని విమర్శించారు. ఇద్దరి కారణంగా తెలం గాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.

విభజన చట్టంలో వరంగల్ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీల విస్మరణ ఎందుకు జరిగిందో స్పష్టం చేశాకే ప్రధానమంత్రి మోదీ నగరంలో అడుగు పెట్టాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నిక ప్రచారం కోసం వరంగల్‌కు మోదీ ఏ ముఖం పెట్టుకొని వస్తున్నారని విరుచుకుప డ్డారు. వరంగల్ అభివృద్ధి వరాలను మోదీ గుజ రాత్‌కు తరలించాడని విమర్శించారు. 'మాము నూరు ఎయిర్‌పోర్టును బీజేపీ పట్టిం చుకోలేదు.. స్మార్ట్‌సిటీకి నిధులు మంజూరు చేయలేదు.. మాస్టర్‌ప్లాన్ లేదు.. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఇవ్వలేదు.. కాజీపేట రైల్వే డివిజన్ గా అభివృద్ధి లేదు.. విభ జన చట్టం హామీల అమలు లేదు.. వేయిస్తంభాలు, రామప్ప ఆలయా లకు అంతర్జాతీయంగా గుర్తింపు పొందినా నిధుల జారీ లేదు..' ఇలా వరంగల్‌ను దిక్కులేకుండా చేసిన మోదీ ఓట్లు అడిగేందుకు ఎలా వస్తున్నారని రేవంత్‌రెడ్డి ప్రశ్నిం చారు. బీజేపీ ఇవ్వలేదు.. బీఆర్ఎస్ అడగ లేదు.. ఇలా వరం గల్ అభివృద్ధిని రెండు పార్టీలు తొక్కి పెట్టాయని మండిపడ్డారు. పదేళ్ల మోదీ పాలనలో వరంగల్ అభివృద్ధికి ఒక్క ప్రాజెక్టు కూడా రాలేదన్నారు.



బీజేపీతో బీఆర్ఎస్ రహస్య ఒప్పందం

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ రహస్య ఒప్పందాన్ని కుదుర్చుకుందని సీఎం ఆరోపించారు. డమ్మీ అభ్యర్థులను బరిలో నిలిపి బీజేపీ గెలుపుకోసం బీఆర్ఎస్ అంతర్గతంగా సహకరిస్తోందన్నారు. బీజేపీలోకి ఆరూరి రమేశ్‌ను సీఎం కేసీ ఆర్ పంపించి ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిపాడని చెప్పారు. బీఆర్ఎస్ నుంచి డమ్మీ అభ్యర్థిగా, దిష్టిబొమ్మలా సుధీర్‌కు మార్‌ను బరిలో దించారని విమర్శించాడు.

ఎర్రబెల్లి, అరూరి అనకొండలు

వరంగల్‌ను ఎర్రబెల్లి, ఆరూరి రమేశ్ వంటి అనకొండలు పట్టిపీడిస్తున్నాయని రేవంత్ రెడ్డి ఆరోపించారు. భూములు మింగే అన కొండల నుంచి ప్రజలను రక్షిం చాల్సి ఉందన్నారు. వీరి నుంచి విముక్తి కల్పించా లనే సంకల్పంతోనే పరిస్థితులు అనుకూ లించకపోయినా ప్రచారానికి వ చ్చాన న్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై ప్రజ లను వంచించే కుట్రలను తిప్పికొట్టే యుద్ధం చేస్తున్నట్లు చెప్పారు. మే 13న జరిగే ఎన్నికలను తెలంగాణ వర్సెస్ గుజరాత్ ఫైనల్స్‌గా అభివర్ణిం చారు. ఈ 'దంగల్'లో వరంగల్ పౌరుషాన్ని చాటా లని, యుద్ధంలో తనకు సహకరించాలని రేవంత్‌రెడ్డి కోరారు.

పోరాటం చేసి అధికారంలోకి వచ్చా..

కేసీఆర్.. నేను అల్లాటప్పా కాదు.. పదేళ్లు పోరాడి అధికారం లోకి వచ్చా.. అంటూ రేవంత్‌రెడ్డి భావోద్వేగంతో ప్రసంగిం చారు. తెలంగాణను దగా చేసి మోదీ కాళ్ల వద్ద కేసీఆర్ తాకట్టు పెట్టాడని మండిపడ్డారు. కేసీఆర్‌కు నీతి జాతి లేదంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఓడినా ఆయనలో మార్పు రాలేదన్నారు. వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను లక్ష మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమాల్లో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, వరం గల్ లోక్‌సభ ఇన్‌చార్జి రేవూరి ప్రకాశ్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఎమ్మెల్యేలు నాగరాజు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జన్ను పరంజ్యోతి తదితర నాయకులు పాల్గొన్నారు.



కమలంలో మోదీ మేనియా!

వరంగల్ లోక్‌సభ స్థానంలో పట్టుకు కాషాయ పార్టీ ప్రయత్నాలు

- బీజేపీ అభ్యర్థి అరూరి గెలుపు కోసం నేడు వరంగల్‌కు ప్రధాని
- మోదీ ఇమేజ్ కలిసొస్తుందన్న ఆశల్లో కమల దళం
- ఓరుగల్లు అభివృద్ధిలో కేంద్రం వంతును వివరిస్తున్న నేతలు
- నేటి జనగర్జన బహిరంగ సభకు విస్తృత ఏర్పాట్లు
- సభలో ప్రధాని ఇవ్వబోయే హామీలపై ప్రజల్లో ఆసక్తి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయుల కోట ఓరుగల్లుపై కమలం పార్టీ కన్నే సింది. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ సీటును కైవసం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. 40 ఏళ్ల తరువాత ఈ నియోజకవర్గంలో బీజేపీకి అను కూల వాతావరణం ఉందనే అంచనాల్లో ఆ పార్టీ నేత లున్నారు. ప్రధాని మోదీ మేనియాతో వరంగల్‌లో పాగా వేయాలని బీజేపీ వ్యూహాలు పన్నుతోంది. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేలా వ్యూహాత్మకంగా వ్యవహరించిన అధినాయకత్వం.. అరూరి రమేష్‌ను ఎంపీ అభ్యర్థిగా బరిలోదించింది. అలాగే ఎంతో కీలక మైన ఎస్సీ వర్గీకరణ హామీతో పాటు వరంగల్ అభి వృద్ధి ఎజెండాను తెరపైకి తీసుకొచ్చి ప్రజల్లోకి వెళ్లేం దుకు ప్రయత్నాలు చేస్తోంది. బుధవారం వరంగల్ నిర్వహించే ఓరుగల్లు జనగర్జన సభకు ప్రధాని మోదీ వస్తుండటంతో భారీగా జనసమీకరణ చేసి బల నిరూ పణకు స్థానిక బీజేపీ నాయకత్వం సిద్ధమవుతుండటం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

వరంగల్ లక్ష్యంగా బీజేపీ వ్యూహాలు

రాష్ట్రంలో సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లు గెలవాలన్న లక్ష్యం పెట్టుకున్న బీజేపీ.. వరంగల్ సీటుపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. 1984లో దేశవ్యాప్తంగా ఆ పార్టీ కేవలం రెండు ఎంపీ సీట్లనే గెలవగా.. అందులో వరం గల్ ఒకటి. నాడు హనుమకొండ ఎంపీ అభ్యర్థిగా బీజే పీకి చెందిన చందుపట్ల జంగారెడ్డి విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. అప్పటి నుంచి మళ్లీ బీజేపీ గెలిచింది లేదు. కనీసం గట్టి పోటీ కూడా ఇవ్వ లేదు. 40ఏళ్లుగా గెలుపు కోసం ఉవ్విళ్లూరుతున్న బీజే పీకి ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు ఆశలు రేకెత్తిస్తున్నా యి. దీంతో వ్యూహాత్మకంగా బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమే ష్‌ని బీజేపీలో చేర్చుకుని వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించి ఎన్నికల క్షేత్రంలోకి కమలనాథులు దిగారు. అరూరికి వరంగల్ వ్యాప్తంగా ఉన్న వ్యక్తిగత పరిచ యాలతో పాటు పాత బీఆర్ఎస్ కేడర్‌ను కమలం గూ టికి తీసుకరావటంలో కొంత వరకు విజయం సాధిం చడం బీజేపీకి ఊపు తీసుకవచ్చిందనే చర్చ జరుగు తోంది. అలాగే అరూరి రమేష్‌కు పోల్ మేనేజ్‌మెంట్‌లో పట్టుండటంతోపాటు లోక్‌సభ పరిధిలోని అన్ని గ్రామాల నేతలతో స్వయంగా మాట్లాడటం కూడా కేడ ర్‌లో ఉత్సాహం నెలకొందనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. దీనికి తోడు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్య క్షుడు మంద కృష్ణమాదిగ మద్దతు కూడా అరూరి రమే ష్‌కు ఇవ్వటంతో ఎమ్మార్పీఎస్ నేతలు రమేష్ గెలుపు కోసం ఊరూరా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ అనుకూలాంశాలతో బీజేపీ వరంగల్‌లో పాగా వేయా లనే లక్ష్యంతో అడుగులు వేస్తోంది.

మోదీ చరిష్మాపై ఆశలు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ చరిష్మాపై బీజేపీ నేతలు ఆశలు పెట్టుకున్నారు. మూడోసారి కూడా ప్రధానమంత్రిగా మోదీనే అధికారంలోకి వస్తారని నమ్ముతున్న బీజేపీ.. వరంగల్‌లో కూడా మోదీ మేనియా ఉందని విశ్వసిస్తోంది. అంతేకాకుండా వరంగల్‌కు పదేళ్ల కాలంలో మోదీ నేతృత్వంలో చేసిన, చేపట్టిన పలు అభి వృద్ధి కార్యక్రమాలను బీజేపీ నేతలు ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. వరంగల్‌కు స్మార్ట్ సిటీ, హెరి టేజ్ సిటీగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసి అభి వృద్ధి చేస్తోందని వివరిస్తున్నారు. అలాగే కాకతీ యుల కాలం నాటి రామప్పకు ప్రపంచవారసత్వ కట్టడంగా గుర్తింపు తీసుకవచ్చింది కూడా బీజే పీనే అని, తెలుగు రాష్ట్రాల్లో యునెస్కో

మిగతా 8వ పేజీలో..

బీజేపీ సభకు ఏర్పాట్లు పూర్తి 7

నేడు వరంగల్‌కు నరేంద్రమోదీ

ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరంగల్‌కు వస్తుండటంతో బీజేపీ శ్రేణులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నాయి. బుధవారం ఉదయం 10గంటలకు వరంగల్ నగర సమీపంలోని తిమ్మా పూర్ రోడ్డులో గల లక్ష్మీపురం వద్ద భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది జూలై 8న వరంగ ల్‌కు వచ్చిన మోదీ.. పలు అభివృద్ధి పనులకు భూమి పూజలు నిర్వహించారు. ఈసారి ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారానికి వస్తుండటంతో పాటు వరంగల్ సీటును బీజేపీ నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. దీంతో వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, స్టేషన్‌ఘనపూర్, పరకాల నియోజకవర్గాల నుంచి భారీగా జనాన్ని సమీకరిం చాలని ప్రణాళిక రూపొందిస్తున్నారు. భూపాలపల్లి, పాల కుర్తి నుంచి జనసమీకరణకు కసరత్తు చేస్తున్నారు. సుమారు లక్షన్నర మందిని సభకు తరలించి సత్తా చాటా లని బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ వ్యూహరచన చేస్తు న్నారు. ఉదయమే సభ ఉండటంతో నగరం చుట్టుప్రాంతాల నుంచి ఎక్కువ మందిని సభకు తరలిం చాలని బీజేపీ నేతలు కసరత్తు చేస్తున్నారు.

నేను పక్కా లోకల్

- కడియం కావ్యది గుంటూరు
- సుధీర్‌కుమార్‌ది కరీంనగర్ లోక్‌సభ
- శ్రీహరి డూప్లికేట్ దళితుడు
- దమ్ముంటే నా భూకబ్జాలు నిరూపించాలి
- వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్


మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న అరూరి రమేశ్

పదేళ్లలో మోదీ చేసిందేమీ లేదు

మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి


బస్సుయాత్రలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

జనగామ కల్చరల్, మే 7: కేంద్రంలో గత పదేళ్లలో మోదీ ఆధ్వర్యంలో దేశంలో జరిగిన అభివృద్ధి శూన్యమని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. 'జాగో తెలంగాణ' పేరుతో ఆయన చేపట్టిన ఓటరు చైతన్య బస్‌యాత్ర మంగళవారం జనగామ జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ పదేళ్లుగా బీజేపీ చేసిన అవినీతి పాలన గురించి చెప్పడానికి, ఓటర్లను చైతన్యం చేయడానికి ఈ బస్సు యాత్ర ప్రారంభించామన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ ఏ విధంగా రాష్ట్రాన్ని పాలించారో కేంద్రంలో ప్రధానిగా నరేంద్రమోదీ అదే విధంగా చేశారన్నారు. తెలంగాణలో ప్రతీ రూపాయి పన్నులో కేంద్రం వాటా తీసుకుంటుందన్నారు. మోదీ తన ప్రసంగంలో పాకిస్తాన్, చైనా అంటూ మాట్లాడటమే తప్ప తన హయాంలో చేసిన అభివృద్ధి మాత్రం చెప్పుకోలేకపోతున్నారని విమర్శించారు. బస్సు యాత్రలో 10 మంది ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

మంగళవారం
ఉష్ణోగ్రత
గరిష్ఠం : 38.5°C
కనిష్ఠం : 27.0°C

- రేవంత్‌ది దొంగ బుద్ధి పాలన
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఐనవోలు మండలంలో ముఖ్య కార్యకర్తల సమావేశం

కేసీఆర్‌ది దూరదృష్టి పాలన

ఐనవోలు, మే 7: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేసీఆర్ దూరదృష్టితో పాలనచేస్తే.. ప్రస్తుత ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి దొంగబుద్ధితో పాలనచేస్తూ ప్రజ లను వంచిస్తున్నాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయా కర్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని ఐనవోలు, పంథిని, కక్కిరాలపల్లి, నందనం, రాంనగర్, ఒంటిమామిడిపల్లి, పున్నేలు ఎంపీటీసీ స్థానాల పరిధిలోని గ్రామాల్లో బీఆ ర్ఎస్ బూత్ ఇన్‌చార్జులు, ముఖ్యకార్యకర్తల సమావే శాలు మంగళవారం జరిగాయి.

ఈ సమావేశాల్లో పాల్గొన్న దయాకర్‌రావు మాట్లా డుతూ.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అమలుకాని హామీలతో మభ్యపెట్టి గెలిచిన విషయం ప్రజలకు ఐదునెలల్లోనే తెలిసిపోయిందన్నారు. అభివృద్ధి, సంక్షే మం, వ్యవసాయ ఫలాలను అందించిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించి తప్పుచేశామని ప్రజలు గుర్తించా రన్నారు. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎ స్‌కు పట్టం కట్టడానికి సిద్ధమయ్యారని తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ 50వేల పైచిలుకు మెజారిటీతో గెలుస్తున్నాడని, అదేవిధంగా రాష్ట్రంలో 11 స్థానాల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తున్నట్లు సర్వేల ద్వారా తెలిసిందని చెప్పారు. తాను ఒకసారి ఓడిపోతేనే తనకు మెదడులేదంటున్న కడి యం.. నాలుగుసార్లు ఓడిపో యిన ఆయనను ఏమనాలో చెప్పండంటూ అడిగారు. కడియం శ్రీహరి చదువుకు తన తండ్రి డబ్బులు పెడితే.. తాను డబ్బులు పెట్టి ఆయన ను రాజకీయాల్లోకి తీసుకువచ్చి ఎమ్మెల్యేను చేశానన్నారు. అలాంటిది తననే విమర్శిస్తున్నాడని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కడియం శ్రీహరికి ఏం తక్కువ చేసిందని ఎర్రబెల్లి ప్రశ్నించారు. ఎంపీ, ఎమ్మెల్సీ, ఉప ముఖ్యమంత్రి పదవి, ఎమ్మెల్యే పదవులు అందించ డమే కాకుండా ఆయన కూతురుకు ఎంపీ టికెట్ ఇచ్చి మూట ఇచ్చిందన్నారు. దాన్ని పట్టుకొని పోయి పార్టీ ఫిరాయించిన మోసగాడని విమర్శించారు. అరూరి రమేష్‌కు రెండు సార్లు ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ అవకా శం కల్పిస్తే భూ కబ్జాలకు పాల్పడి రూ.వందల కోట్లు సంపాదించుకొని పార్టీ ఫిరాయించాడని దయాకర్ రావు ఆరోపించారు. ఈ ఎన్నికల్లో అతడికి ఓటమి తప్పదన్నారు. కడియం, అరూరిలకు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కాంగ్రెస్‌పై నమ్మకం పోయింది

పాలకుర్తి, మే 7: కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు నమ్మకం పోయిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం రాత్రి ఆయన మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ గళం వినిపించేందుకు పార్లమెంటులో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. దేశంలో బీజేపీ పదేళ్ల నుంచి ప్రజలను మోసం చేస్తూ వస్తోందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలను ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. వరంగల్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇందుకు బూత్ స్థాయి కార్యకర్తలు కష్టపడి పని చేయాలని కోరారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడం సాధ్యం కాదన్నారు. 100 రోజుల్లో ఈ పథకాలను అమలు చేస్తానని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదని అన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు నాగిరెడ్డి, నవీన్, శ్రీనివాసరావు, యాకాంతరావు తదితరులు పాల్గొన్నారు.









మేడిగడ్డను పరిశీలించిన జస్టిస్ పీసీ ఘోష్

● అరగంట పాటు పర్యటన.. పలు అంశాలపై అధ్యయనం ● కుంగుబాటుకు గల కారణాలు, సాంకేతిక పరమైన అంశాలపై ఆరా


బ్యారేజీలో కుంగిన 20వ పిల్లరు వద్ద వివరాలు తెలుసుకుంటున్న జస్టిస్ పీసీ ఘోష్

మహదేవపూర్ రూరల్/కాటారం, మే 7: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని జ్యుడీషియల్ కమిషన్ చైర్మన్, సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జి పినాకి చంద్ర ఘోష్ మంగళవారం సందర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన నేపథ్యంలో మంగళవారం నీటిపారుదల శా ఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో సందర్శించారు. మధ్యాహ్నం 1.40 గంటలకు మేడిగడ్డకు చేరుకున్న ఆయన బ్యారేజీ వంతెన పైనుంచి కుంగిన పిల్లర్లను పరిశీలించిన అనంతరం వంతెన కింద కుంగుబాటుకు గురైన 7వ బ్లాకులోని 19, 20, 21వ పిల్లర్లను పరిశీలించిన ఆయన మధ్యాహ్నం 2.11 గంటలకు అంబట్‌పల్లిలోని ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయానికి చేరుకుని భోజన విరామం తీసుకున్నారు. సుమా రు గంటన్నర పాటు ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయంలోనే ఉన్న ఆయన సాయంత్రం 4 గంటలకు తిరిగి కాళేశ్వరాలయంలో దర్శనానికి వెళ్లారు.

త్వరలోనే పూర్తిస్థాయిలో విచారణ చేపడతాం : పీసీ ఘోష్

కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణలో భాగంగా మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించిన జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ బ్యారేజీ నిర్మాణ సంస్థకు పలు సూచనలు చేసినట్టు తెలిసింది. 'బ్యారేజీ నిర్మాణం చేసింది మీరే. దానిని పునరుద్ధరించాల్సిన బాధ్యత కూడా మీపైనే ఉంది' అరి సంస్థ ప్రతినిధులతో వ్యాఖ్యానించినట్టు సమాచారం. బ్యారేజీ నిర్మాణ సమయంలో సాంకేతిక పరమైన అంశాలకు సంబంధించి పలు విషయాలను క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ వెంకటకృష్ణతో పాటు ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీలో 19, 20, 21వ పిల్లర్లను పరిశీలించిన ఆయన పగుళ్లు, బ్యారేజీ దెబ్బతినడానికి గల పరిస్థితులపె ఆరా తీశారు. అనంతరం అంబట్‌పల్లిలోని ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడిన పీసీ ఘోష్ కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణలో భాగంగానే మేడిగడ్డ బ్యారేజీని క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. అయితే ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై అభిప్రాయం ఏంటని విలేకరులు అడగగా ఆ నివేదిక ఇంకా తమ వద్దకు రాలేదని, రాగానే దానిని విశ్లేషిస్తామని తెలిపారు. బ్యారేజీ పరిశీలనలో ఏదైనా లోపాన్ని గుర్తించారా.. అని మరో విలేకరి ప్రశ్నించగా తానేమీ ఇంజనీర్‌ను కాదని.. కుంగుబాటుకు గల కారణాలను ఇప్పుడే గుర్తించలేమన్నారు. త్వరలోనే సాంకేతిక నిపుణులలతో కలిసి పూర్తి వివరాలు సేకరిస్తామని తెలిపారు. జస్టిస్ వెంట ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్, ఈఎన్‌సీ నాగేందర్‌రావు, కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ కిరణ్ ఖరే, సీఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ తిరుపతిరావు, డీఈఈ సురేష్, ఎల్‌అండ్‌టీ ప్రాజెక్టు మేనేజర్ రజనీష్ తదితరులున్నారు.


బ్లాక్-7లో పరిశీలన చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


ఫిరోజ్ పాషా మృతదేహం

వరంగల్ క్రైం, మే 7: అనుమానాస్పద స్థితిలో మహ్మద్ ఫిరోజ్ పాషా(37) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సుబేదారి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రంగశాయిపేటకు చెందిన మహ్మద్ రబ్బాని పెద్ద కుమారుడు ఫిరోజ్‌పాషా తాగుడుకు బానిసకావడంతో అతడి భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తాగుడు మానేసిన ఫిరోజ్ పాషా ఆటో నడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఒక మహిళ రబ్బానికి కాల్ చేసి మీ కుమారుడు న్యూశాయంపేట రోడ్డుపై చనిపోయి ఉన్నాడని చెప్పింది. వెళ్లి చూసిన రబ్బాని రోడ్డుపై తీవ్రగాయాలతో మృతి చెందిన వ్యక్తి తన కుమారుడు ఫిరోజ్ పాషా అని గుర్తించి పోలీసులకు పిర్యాదు చేశాడు. రబ్బాని ఇచ్చిన పిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.





మహిళలు సామాజిక సేవ చేయడం

అభినందనీయం

● సైబర్ క్రైమ్ ఏసీపీ కుంజ విజయ్‌కుమార్

● చక్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖులకు సన్మానం


వివిధ రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులను సన్మానిస్తున్న చక్రి ఫౌండేషన్ సభ్యులు

హనుమకొండ చౌరస్తా, మే 7: సామాజిక సేవలో మహిళలు ముందుకు రావడం అభినందనీయమని వరంగల్ సైబర్ క్రైమ్ ఏసీపీ కుంజ విజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కళా రంగాలలో రాణిస్తున్న ప్రముఖులకు చక్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ లక్ష్మీపురంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో చక్రి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్మన్ చెట్టిపల్లి దేవిక అధ్యక్షతన నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఏసీపీ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేవిక భర్త పేరున ఫౌండేషన్ స్థాపించి సామాజిక సేవలు చేయాలనే ఆలోచన రావడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథి, తెలంగాణ బీసీ సంఘం నాయకురాలు లయన్ పద్మజాదేవి మాట్లాడుతూ.. భర్తను కోల్పోయి కష్టాల్లో ఉన్నప్పటికీ స్వయం శక్తితో ఎదిగి సామాజిక సేవ చేయటానికి దేవిక ముందుకు రావడం గర్వించదగ్గ విషయమని ఆమె కొనియాడారు. ప్రత్యేక అతిథి బాల మానస మహా విద్యాపీఠం గురువర్యుడు లక్ష్మీనారాయణ గురు భవానీ మాట్లాడుతూ.. ఎన్నో రుగ్మతలు ఎదుర్కొని సామాజిక సేవలో ముందుకు సాగుతున్న దేవిక ఒక వ్యక్తి కాదని ఆమె ఒక శక్తి అని కొనియాడారు. దేవికను ఆదర్శంగా తీసుకొని మహిళలు సేవ రంగాలలో రాణించాలని ఆయన కోరారు. చక్రి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్మన్ చెట్టిపల్లి దేవిక మాట్లాడుతూ.. సమాజంలో పేదలు పడుతున్న బాధలను పంచుకోవాలనే ఉద్దేశంతో కరోనా సమయంలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు అండగా నిలిచామన్నారు. స్వయం ఉపాధిలో కొన్ని కుంటుంబాలకు, మహిళలకు, చేయూతనివ్వడంతో పాటు వృద్ధులు, అనాథలు, మానసిక వికలాంగులకు, అంధులకు సహాయ సహకారాలను అందిస్తున్నామన్నారు. భర్త లేడనే బాధను దిగమింగుకొని సామాజిక సేవ చేయాలనే సంకల్పంతో పెద్దలు, మిత్రుల, సహకారంతో చక్రి ఫౌండేషన్ స్థాపించి సేవచేస్తూ సమాజంలో ప్రతీ నిరుపేద కళ్లలో ఆనందం చూడటమే తన లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాలలో రాణిస్తున్న 35మంది ప్రముఖులను చక్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించి మెమెంటోలను అందించారు. ఈ కార్యకమంలో డాక్టర్ జగదీశ్వర్, విశ్వ కవి సిరాజోద్దిన్, రమేష్, ఫౌండేషన్ బాధ్యులు శ్రావణి, రాహుల్, శిల్ప, మౌనిక, అభి ఉదయ్, కృష్ణ, కీర్తి, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారంలో బల్లి

కేయూ కామన్ మెస్‌లో ఘటన.. ఆందోళనకు దిగిన విద్యార్థులు


హాస్టల్ ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు, చట్నీలో పడిన బల్లి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 7: కాకతీయ యూనివర్సిటీ కామన్ మెస్‌లో ఉదయం పూట అల్పాహారం చట్నీలో బల్లి పడింది. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. దీంతో విద్యార్థులు ఆందోళనకు గారు. హాస్టల్స్ డైరెక్టర్ పర్యవేక్షణ లేకపోవడంతోనే హాస్టల్స్ సిబ్బంది పరిశుభ్రత పాటించడం లేదని, మూడు నెలలుగా మెస్ బిల్లులు రూ.2వేలు దాటుతోందని ఆరోపించారు. నాసిరకం, నాణ్యతలేని కిరాణ సామగ్రితో తయారైన భోజనాలు చేయాల్సి వస్తోందని వారు హాస్టల్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సం దర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కామన్ మెస్‌కు తాళం వేసి విద్యార్థులు ఆందోళన చేశారు. మెస్‌లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరపాలని డైరెక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. చట్నీలో బల్లి పడటానికి కారణ మైన వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో డైరెక్టర్ శ్రీనివాస్ రావు పూర్తి విచారణ జరిపి ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకుం టామని హామీ ఇవ్వడంతో విదార్థులు ఆందోళన విరమించి భోజనం చేశారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి

విద్యుత్ అధికారులకు ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాలు

హనుమకొండ టౌన్, మే7: టీఎస్ ఎన్పీడీఎసీఎల్ పరిధిలోని 16 సర్కిల్స్‌లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈదురుగాలులతో కురుస్తున్న వర్షం నేపథ్యంలో సీఎండీ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ ఒక్క సిబ్బంది విధిగా హెడ్‌క్వార్టర్‌లో ఉండి సేవలందించాలన్నారు. మెన్ అండ్ మెటరియల్‌ను సిద్ధం పెట్టుకోవాలన్నారు. అత్యవసరం ఉంటే వెంటనే స్పందించేలా ముందుస్తు ఏర్పాట్లు చేసుకొని ఉంచుకోవాలన్నారు. గోదావరి తీరప్రాంతాలైన ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, అదిలాబాద్ పరిసర ప్రాంతాల్లోని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా సరఫరా అందించాలన్నారు. అంతరాయాలు ఏర్పడితే ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగకుండా ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్స్‌కు సంబంధించిన వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎస్పీఎం షెడ్లలో ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు పెంచుకొని, రోలింగ్ స్టాక్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. స్థానికంగా ఉన్న సమస్యలను వెంటనే కార్పొరేట్ ఆఫీస్‌లోని కంట్రోల్ రూమ్‌కు చేరవేయాలన్నారు. జిల్లా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకెళ్లాలన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలపై టోల్‌ఫ్రీ నెంబర్ 18004250028 లేదా 1912 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

మోదీ వల్ల తెలంగాణకు ఒరిగిందేమీ లేదు

తాటికొండ కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే కడియం



తాటికొండ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, మే 7: ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో తెలంగాణకు ఒరుగబెట్టింది ఏమీ లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం ఆయన తాటికొండ గ్రామంలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. తన భార్యను పట్టించుకోని మోదీ దేశంలోని మహిళలకు ఏం న్యాయం చేస్తాడని ప్రశ్నించారు. తెలంగాణకు ఏమీ ఇవ్వని మోదీకి ఓటు ఎందుకు వేయాలన్నారు. మోదీకి దళితులు, క్రిస్టియన్లు, మహిళలు అంటే గిట్టదన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గానికి 7వేల ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరకు పదవి ఇవ్వాలని, నిధులు ఇవ్వాలని సీఎంను కోరగా హామీ ఇచ్చారని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీలకు ఓటువేస్తే మురికి కాలువలో వేసినట్లేనని అన్నారు. మొన్నటి వరకు ఎమ్మెల్యేగా చేసిన వ్యక్తి ఎన్ని వేశాలు వేషాడో, డ్రామాలు చేశాడో అందరికీ తెలిసిందేనని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి రాజయ్య మీద ప్రేమ ఉంటే తాను పార్టీ మారిన తరువాత రాజయ్యకు టికెట్ ఎందుకు ఇవ్వలేదన్నారు. సభ్యత లేని రాజయ్య నీచంగా మాట్లాడుతున్నాడని, ఆయనను స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలే కాకుండా, రాజకీయ పార్టీలు కూడా పక్కకు పెట్టినా సిగ్గు రావడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర, నాయకులు చల్లా సుధీర్ రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, రాపోలు మధుసూదన్‌రెడ్డి, చాడ రాజ్‌కుమార్, జూలకుంట్ల శిరీష్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, వక్కల రాజు, బేతి రత్నాకర్ రెడ్డి, ఎడమ కట్టమల్లు తదితరులు పాల్గొన్నారు.

'చామల'కు మద్దతుగా ప్రచారం



గుండ్లగడ్డలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ, మే 7 (ఆంధ్రజ్యోతి): భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోరుతూ ఆ పార్టీ నాయకులు మంగళవారం జిల్లాకేంద్రంలోని పలు వార్డుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణరెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కంచె రాములు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ మేనిఫెస్టో కరపత్రాలను చూపుతూ ప్రచారం సాగించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే పేదలకు సంక్షేమం అందుతుందని అన్నారు. భువనగిరిలో చామల కిరణ్‌కుమార్ రెడ్డి గెలుపు ఖాయమైపోయిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు చిత్తుగా ఓడిపోబోతున్నారని జోస్యం చెప్పారు. ప్రచారంలో మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అన్వర్, పట్టణానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్

డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ, మే 7 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న పదేళ్లలో రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా రాష్ట్రాన్ని దోపిడీ చేసిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి జయప్రకాశ్, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ దేవయ్యగౌడ్‌తో కలిసి మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో రాష్ట్రాన్ని సాధించుకుంటే ప్రాజెక్టులు, పథకాలు, పేపర్ లీకేజీల పేరుతో అవినీతికి పాల్పడ్డారని అన్నారు. కుటుంబ ప్రగతి కోసం కేసీఆర్ పాలన సాగించారే తప్ప ప్రజల కోసం కాదన్నారు. మరోవైపు బీజేపీతో రాష్ట్రానికి నష్టమే తప్ప లాభం ఒరిగింది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు సంక్షేమం సాధ్యమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, బడికె ఇందిర పాల్గొన్నారు.



పోచన్నపేటలో తడిసిన ధాన్యం సంచులు, ధాన్యం కుప్ప, హనుమాన్ తండాలో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్న సిబ్బంది

అకాల వర్షం.. ఆగమాగం

జిల్లాలో పలుచోట్ల వర్షం ● ఈదురుగాలుల బీభత్సం ● నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు ● విద్యుత్ సరఫరాకు అంతరాయం

జనగామ, మే 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అకాల వర్షం ఆగమాగం చేసింది. మంగళవారం బలమైన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షం కారణంగా పలు చోట్ల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. వడ్ల రాశులపై టార్పాలిన్లు ఉన్నప్పటికీ వడ్ల కుప్పల కింద నుంచి నీరు పోయి ధాన్యం తడిసిపోయింది. చాలా చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరిపోయాయి. బచ్చన్నపేట మండలం చిన్నరామన్‌చర్లలో రేకుల ఎగిరి మీద పడడంతో భాగ్య అనే మహిళకు గాయాలయ్యాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్తంభాలు కూలడం ద్వారా విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. జనగామ మండలం శామీర్‌పేట వద్ద జాతీయ రహదారిపై భారీ వృక్షం కూలిపోయింది. దీంతో గంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. డిగ్రీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పరీక్షా సమయం దగ్గరపడుతుండడంతో ఆందోళన చెందారు. పోలీసులు గ్రామస్థులు సాయంతో కూలిన చెట్టును తొలగించడంతో రాకపోకలు జరిగాయి.

ఈదురుగాలుల కారణంగా విద్యుత్ శాఖకు భారీ నష్టం ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా 146 స్తంభాలు, 8 ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. జఫర్‌ఘడ్ మండలం హనుమాన్ తండాలో 7 స్తంభాలు కూలగా విద్యుత్ సిబ్బంది పునరుద్ధరించారు. ఈదురుగాలుల నేపథ్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. సమస్యలపై ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. అధికారుల ఆదేశాలతో సిబ్బంది క్షేత్రస్థాయిలో పునరుద్ధరణ పనులు చేపట్టారు.

జిల్లాలో 12 మి.మీ సగటు వర్షపాతం

జిల్లావ్యాప్తంగా మంగళవారం 12 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తరిగొప్పులలో 46.8 మి.మీ, అత్యల్పంగా పాలకుర్తి మండలం వావిలాలలో 1.3 మి.మీ వర్షం కురిసింది. అదే విధంగా నర్మెట్టలో 41.3 మి.మీ, బచ్చన్నపేటలో 35.5 మి.మీ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 17.8 మి.మీ, జఫర్‌ఘడ్ మండలం కూనూరులో 16.5 మి.మీ, జనగామలో 16 మి.మీ, లింగాలఘనపురంలో 15.3 మి.మీ, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండలో 11 మి.మీ, జఫర్‌ఘడ్‌లో 9.8, దేవరుప్పుల మండలం కోలుకొండలో 7.5 మి.మీ, జనగామ మండలం వడ్లకొండలో 7 మి.మీ, రఘునాథపల్లిలో 5.5 మి.మీ, బచ్చన్నపేట మండలం పడమటికేశవాపూర్‌లో 4 మి.మీ, పాలకుర్తిలో 3.5 మి.మీ వర్షం కురిసింది.

బచ్చన్నపేట: బచ్చన్నపేటతో పాటు గ్రామాలలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు ఆరబోసిన ధాన్యం కుప్ప చేసేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. రహదారుల వెంట చెట్లు కొమ్మలు విరిగిపడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జఫర్‌గడ్: మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన ఈదురు గాలులకు పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ధాన్యం తడిసిపోయింది. తిమ్మంపేట, తమ్మడపల్లి(ఐ), ఉప్పుగల్లు, కూనూరు, తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో ఆయకట్టు కింద కోత దశకు వచ్చిన వరి పంట దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు. జఫర్‌గడ్ శివారు నల్లబండ వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టు టెంటు, రేకులు, ఏర్పాటు చేసిన బారికేడ్లు ఎగిరిపోయాయి. దీంతో పోలీసు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నర్మెట: మండలకేంద్రంతో పాటు అమ్మాపురం, గండిరామవరం, వెల్దండ, కన్నెబోయినగూడెం, మచ్చుపహడ్, హన్మంతాపూర్, బొమ్మకూరు తదితర గ్రామాలలో గాలివాన బీభత్సం సృష్టించడంతో పాటు వడగండ్లు కురిశాయి. వెల్దండ, నర్మెట గ్రామాల మధ్య చెట్లు నేలకూలాయి. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలవాలింది. మామిడి తోటలు దెబ్బతిన్నాయి.

మరమ్మత్తులు చేపట్టిన అధికారులు..

కొడకండ్ల: వర్షం వల్ల మండలంలో 30 స్తంభాలు విరిగిపోయాయని ఏఈ రాములు తెలిపారు. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరిస్తున్నామని వివరించారు. లక్ష్మక్కపల్లిలో 11 కేవీ ఫీడర్ ఛానల్‌లో మరమ్మత్తులు చేశామన్నారు.



జనగామ మండలం శామీర్‌పేట వద్ద కూలిన చెట్టు



జనగామలో ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళా రైతు



నర్మెట మండలంలో గాలివానకు నేలవాలిన వరిపంట



నర్మెటలో వడ్ల కుప్పల కిందికి నీరు రాకుండా అడ్డుకట్ట వేస్తున్న మహిళ



జనగామలో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

కడియంను రాజకీయంగా అంతమొందించాలి

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



శ్రీపతిపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

చిలుపూర్, మే 7: తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీని, కార్యకర్తలను మోసం చేసిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని రాజకీయంగా అంతమొందించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య అన్నారు. మంగళవారం ఆయన శ్రీపతిపల్లి, కొండాపూర్, మల్కాపూర్, లింగంపల్లి, చిన్నపెండ్యాల, రాజవరం తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ తరుపున ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లపల్లిలో ఆయన మాట్లాడుతూ ముప్పై ఏళ్ళుగా మాదిగ సామాజిక వర్గ నేతలను రాజకీయంగా అణచివేస్తున్న కడియంకు త్వరలో రాజకీయ సమాధి తప్పదన్నారు. గడిచిన పదేళ్ళుగా మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని తాగు, సాగునీటి రంగంతో పాటు, అన్ని విధాలా అభివృద్ధి చేశామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌ను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏడవెల్లి కృష్ణారెడ్డి, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, జనగామ యాదగిరి, ఆకుల కుమార్, ఉద్దెమారి రాజ్‌కుమార్, మాలోత్ రమేష్‌నాయక్, రంగు హరీష్, చొప్పరి ప్రవీన్, గాలి ప్రవీన్, రచ్చ రవిందర్, వెన్నం మాధవరెడ్డి, మోటం రాములు, తాళ్ళపల్లి క్రాంతికుమార్, గుంటి భీముడు, ఎమ్డీ యాకూబ్‌పాషా, బత్తుల రాజన్‌బాబు పాల్గొన్నారు.

రాజయ్యకు దళితబంధు సెగ

సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే రాజయ్యకు వెంకటాద్రిపేట గ్రామంలో దళితబంధు బాధితుల సెగ తగిలింది. కనకం కిరణ్‌కుమార్, కందుకూరి రత్నాకర్, నాగారపు పురుషోత్తం అనే ముగ్గురు బాధితులు నిలదీశారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నపుడు దళితబంధు పథకం కోసం ఏజెంట్ల ద్వారా తీసుకున్న లక్షలాది రూపాయలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనికి ఆయన సమాధానం చెప్పకుండానే త్వరితగతిన కార్యక్రమాన్ని ముగించుకుని అక్కడినుంచి సైలెంట్‌గా వెళ్ళిపోయారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

● కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, మే 7: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి ఆయన ఎస్ఎస్‌సీలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ ఫలితాల్లో రాష్ట్రంలోనే జనగామ జిల్లా 4వ స్థానంలో ఉండటం గర్వకారణమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. జిల్లా లోని 32 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులందరూ 10 జీపీఏ సాధించారని, 78 పాఠశాలల్లో 100 శాతం ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను అగ్రభాగాన నిలబెట్టారని వివరించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు, మండలాల నోడల్ అధికారులు విద్యార్థులను ప్రోత్సహించి ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చేశారని కొనియాడారు. జిల్లాలోని తరిగొప్పుల ప్రభుత్వ పాఠశాల మండలంలో వందశాతం ఫలితాల్లో ప్రథమ స్థానంలో ఉండటం సంతోషకరమన్నారు. అనంతరం తరిగొప్పుల పాఠశాల సిబ్బందితో పాటు టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను, ప్రధానోపాధ్యాయులను మెమెంటోలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో కె.రాము, జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, డీఆర్‌డీవో మొగులప్ప, బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి దయానందరాణి, డీపీవో వినోద్‌కుమార్, డీటీడీవో ప్రేమకళ, అన్ని మండలాల ఎంఎన్‌వోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డెన్లు పాల్గొన్నారు.



తరిగొప్పుల పాఠశాల సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్



కలెక్టర్ నుంచి మెమొంటో అందుకుంటున్న జఫర్‌గడ్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌తో పాటు విద్యార్థిని కీర్తి, కొడకండ్ల జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని రేణేశ్వరి

కొడకండ్ల: మండలంలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులను కలెక్టర్ రిజ్వాన్ బాషా సన్మానించారు. కొడకండ్ల జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఎస్.రేణేశ్వరితో పాటు టీఎస్ఆర్ఎస్ విద్యార్థులు 11 మంది ఎస్.శృతి, పి.శ్రీజ, ఈ.పూజిత, ఎల్.సాయి మనస్విత, ఎం.జ్యోష్న, పి.అక్షయ, ఎస్.కె.సుహానా, ఎం.పావని, కె.నివేదిత, ఎస్.సిరిచందన, డి.ప్రసన్నదేవి , ఎంజేపి మొండ్రాయి నుంచి ఆరుగురు విద్యార్థులు ఎన్.స్పందన, ఎం.వైష్ణవి, కె.ప్రణతి, ఎ.అశ్విని, ఎ.వర్షిణి, పి.అంకితను సన్మానించారు. అదేవిధంగా కొడకండ్ల ఎస్సీ హాస్టల్ విద్యార్థులు కె.అరుణ్, ఆర్.హరీష్, డి.మనోజ్‌లను కలెక్టర్ అభినందించి సర్టిఫికేట్, మెమెంటోతో సన్మానించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే కీలకం

జిల్లా స్వీప్ నోడల్ అధికారి వినోద్‌కుమార్

జనగామ కల్చరల్, మే 7: ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ముఖ్యమే అని జిల్లా స్వీప్ నోడల్ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన ఓటరు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైందన్నారు. లోకసభ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం ఓటు ప్రాముఖ్యత, వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

బచ్చన్నపేట, మే 7: ప్రముఖ శైవక్షేత్రం కొడవటూరు సిద్దేశ్వరాలయ హుండీలను ఈ నెల 8న లెక్కిస్తామని ఈవో చిందం వంశీ తెలిపారు. దేవదాయశాఖ స్పెషల్ ఆఫీసర్ సమక్షంలో బుధవారం ఉదయం 11 గంటలకు లెక్కింపు ఉంటుందన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిలుపూర్, మే 7: చిలుపూర్ గుట్టలో అనారోగ్యంతో మృతిచెందిన ఆకుల సురేశ్ (42) కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా నాయకుడు మహ్మద్ షకీల్ పరామర్శించారు. తక్షణ సాయంగా రూ.5 వేల నగదును అందజేశారు. భవిష్యత్తులోనూ బాధిత కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. ఆయన వెంట చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి తౌటి సునిల్, గొల్లపల్లి వాసు, గనగోని గౌతమ్, ఆకుల సాంబరాజు తదితరులు ఉన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణే ధ్యేయం

ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ సదర్‌లాల్

స్టేషన్‌ఘన్‌పూర్, మే 7: విద్యుత్ ప్రమాదాల నివారణే ధ్యేయంగా ప్రతీ కార్మికుడు పని చేయాలని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ సదర్‌లాల్ సూచించారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని డీఈఈ కార్యాలయంలో విద్యుత్ భద్రత వారోత్సవాల వాల్ పోస్టర్లను సిబ్బందితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు, వినియోగదారులు భద్రత నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో డీఈఈ హుస్సేన్‌నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

కొడకండ్ల మే 7 : మండలకేంద్రంలో రైతు కోట చిన రామచంద్రుకు చెందిన రూ.20 వేల రూపాయల విలువైన గడ్డివాము దగ్ధమైంది. తన 3 ఎకరాలలో వేసవి పంటకు వచ్చిన గడ్డిని కొద్దిరోజుల క్రితమే వ్యవసాయ బావి వద్ద వాముగా పెట్టామని, మంగళవారం మధ్యాహ్నం ఎవరో గుర్తు తెలియని ఆకతాయిలు తమ గడ్డివామును తగులబెట్టారని బాధిత రైతు అనుమానం వ్యక్తం చేశారు.

కమలంలో మోదీ మేనియా!

(5వ పేజీ తరువాయి)

గుర్తింపు పొందిన కట్టడంగా రామప్పను ఎంపిక చేయటంలో మోదీ పాత్ర ఉందని బీజేపీ నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. రామప్ప అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.100కోట్లకు పైగా నిధులు కేటాయించిందని, వేయి స్తంభాల ఆలయంలోని కల్యాణ మండపానికి, వరంగల్ కోటను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి భారీగా నిధులు కేటాయించారని పేర్కొంటున్నారు. వీటితో పాటు కాజీపేటలో రూ.500కోట్ల వ్యయంతో రైల్వే తయారీ యూనిట్‌ను ప్రధాని ఇటీవలే భూమి చేశారని, అలాగే కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును పీఎం మిత్ర పథకం కింద ఎంపిక చేశారని గుర్తు చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రంతో సఖ్యతగా వ్యవహరించకపోవడంతో అభివృద్ధి జరగలేదని బీజేపీ నేతలు చెబుతున్నారు. దీనికి తోడు బీజేపీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు పేదలకు చేరాయని చెబుతున్నారు. కేంద్రంలో మోదీకి ప్రత్యామ్నాయ నేతలు లేరని, మళ్లీ బీజేపీ సర్కారే అధికారంలోకి వస్తుందనే ధీమాలో ఆ పార్టీ నేతలున్నారు. అయోధ్య రామమందిరం నిర్మాణం కూడా తమకు కలిసొస్తుందనే అంచనాల్లో ఆ పార్టీ ఉంది. ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలను తిప్పి కొడుతూనే బీజేపీ వ్యూహాత్మకంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజల్లోకి అభ్యర్థి అరూరి రమేష్‌ని తీసుకెళుతోంది. మోదీ చరిష్మా, అభ్యర్థి అరూరి రమేష్ విస్తృత పర్యటనలు తమకు కలిసొస్తాయనే ఆశలో కమలనాథులున్నారు.

మోదీ హామీలపై ఆసక్తి

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వరంగల్ అభివృద్ధికి ఏయే హామీలు ఇస్తారనే ఆసక్తి ఓటర్లలో కనిపిస్తోంది. ప్రధానంగా 2016లో కేంద్ర ప్రభుత్వం వరంగల్‌కు సైనిక్ స్కూల్‌ను మంజూరు చేసింది. అయితే గత ప్రభుత్వం సైనిక్ స్కూల్ ఏర్పాటుకు భూమిని కేటాయించకుండా నిర్లక్ష్యం చేసింది. దీంతో సైనిక్ స్కూల్‌ను సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వరంగల్‌లోనే సైనిక్ స్కూల్ కొనసాగేలా మోదీ హామీ ఇస్తారనే ఆశతో ప్రజలున్నారు. అలాగే కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో నవోదయ, కేంద్రియ విద్యాలయాల ఏర్పాటు, మామునూరు విమానాశ్రయాన్ని వినియోగంలోకి తీసుకు రావడంపై మోదీ భరోసా ఇస్తారా? అనే ఆశతో ఓటర్లు ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు వరంగల్ జిల్లాలో ఉన్న కీలక సమస్యలపై హామీలు ఇస్తారనే ఆశలో ఓటర్లున్నారు. కాగా, ప్రధానంగా పట్టణ ఓటర్లను కాషాయ పార్టీ ఎక్కువ లక్ష్యంగా చేసుకుంటోంది. వరంగల్ తూర్పు, పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో ప్రధాని మోదీకి బలమైన మద్దతు లభిస్తుందని ఆ పార్టీ అంచనా వేస్తోంది. స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి, భూపాలపల్లి నుంచి కూడా ఓటు బ్యాంకు భారీగా పెరుగుతుందన్న అంచనాల్లో ఆ పార్టీ నేతలున్నారు. కాంగ్రెస్ నుంచి బలమైన అభ్యర్థి బరిలో ఉండటంతో పక్కాగా గెలిచేలా అధిష్ఠానం వరంగల్ నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు.

మతవిద్వేశాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరామ్



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

జనగామ కల్చరల్, మే 7: మతవిద్వేశాలు రెచ్చగొట్టడం ద్వారా బీజేపీ అధికారంలోకి రావాలనుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరామ్, రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ అన్నారు. భారత్ బచావో, సాదిక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సాదిక్ ఫౌండేషన్ చైర్మన్ సాదిక్ అలీ అధ్యక్షతన 'ప్రమాదంలో భారత రిపబ్లిక్ పౌరుల పాత్ర' అనే అంశంపై జరిగిన ప్రజా సదస్సులో వారు మాట్లాడారు. కుల, మత ప్రమేయం లేని మనదేశంలో మతోన్మాదాన్ని ప్రజల మెదడులో చొప్పించి, నెమ్మదిగా విషాన్ని నింపి ప్రజల మధ్య కొట్లాటలు సృష్టిస్తూ మతోన్మాదులు తమ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. పదేళ్లుగా భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువలను కేంద్రంలో ఉన్న పార్టీ అపహాస్యం చేస్తోందన్నారు. భారతదేశం అన్ని మతాల వారిదని, ఏ ఒక్క మతానికీ పరిమితం కాదని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు సాదిక్ అలీ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ప్రజల వైపున నిలబడి తమ సంస్థ గత 10 సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజమౌళి, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ హక్కును వినియోగించుకోవాలి

● అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

జనగామ కల్చరల్, మే 7: పోస్టల్ బ్యాలెట్ పొందిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ కోరారు. ఈ నెల 8వ తేదీతో పోస్టల్ బ్యాలెట్ గడువు ముగియనుండడంతో జిల్లా కేంద్రంలోని ఆర్‌డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ సందర్శించి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజూ జరిగే పోలింగ్ ప్రక్రియను ఎన్నికల పోర్టల్ లో అప్‌లోడ్ చేయాలని సిబ్బందికి సూచించారు. హెల్ప్‌డెస్క్ పనితీరును పర్యవేక్షించి రిజిస్టర్లను తనిఖీ చేసి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బ్యాలెట్ పేపర్లను జాగ్రత్తగా అమర్చాలి..

స్టేషన్‌ఘన్‌పూర్: బ్యాలెట్ యూనిట్లతో అభ్యర్థుల గుర్తులకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లను జాగ్రత్తగా అమర్చాలని ఆర్డీవో ధరంసోత్ వెంకన్న తెలిపారు. మంగళవారం ఆయన డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలించి ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దు అని సూచించారు.